క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



మాజీ మంత్రి వేణుతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను విజయ దశమి సందర్భంగా గురువారం ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన గిరజాల వీర్రాజు (బాబు), నక్కా శ్రీ నగేష్, గుబ్బల తులసి రామ్, అద్దంకి ముక్తేశ్వరరావు కలిశారు. ఆయనకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



కోటిలింగాల ఘాట్‌ను శుభ్రం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

కంబాలచెరువు: స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోటిలింగాలరేవును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ ధర్మప్రకాశ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ దీపక్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ దినేష్ కుమార్ శర్మ, ఇన్‌స్పెక్టర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కంబాలచెరువు: జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అందరికీ న్యాయం, న్యాయ సహాయం ద్వారా అనే నినాదంతో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరిపారు. ఈ సందర్భంగా ఎస్‌కేవీటీ పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఎల్.మహేష్ శ్రీలక్ష్మణ్ ప్రథమ, ఎం.చరణ్ ద్వితీయ, ఆనంద్ నగర్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని కె.జాహ్నవి తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ ఉపాధ్యాయులు పువ్వాల బాపిరాజు, డి.కనకలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛోత్సవ్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 15 రోజుల పాటు కొనసాగిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శుక్రవారం తెలిపారు. స్వచ్ఛత, సత్యం, అహింస అనే బాపూజీ ప్రాథమిక విలువలను ప్రతి ఒక్కరూ జీవితాంతం ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛోత్సవ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు బాలికల హాస్టల్ ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించి, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు స్వచ్ఛత, ప్రపంచ నివాస దినోత్సవంపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ప్రిన్సిపాల్ సందర్శించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్, బాలికల వసతి గృహం డిప్యూటీ వార్డెన్ బి.దుర్గాలక్ష్మి, డాక్టర్ కె.అనూష, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: అవతార్, సన్నీ సంస్కారికి తులసీ కుమారి
సూర్యప్యాలెస్	: కాంతారా-1
స్వామి	: ఓజీ
అనుశ్రీ	: ఓజీ
శివజ్యోతి	: ఓజీ
రాజా	: ఓజీ
ఊర్వశి	: కాంతారా-1
మేనక	: ఇడ్లీకొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా-1
అశోక	: ఇడ్లీకొట్టు
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కాంతారా-1, ఓజీ
కడియం	
వెంకట సూర్య	: ఓజీ

ప్రత్యేక పద్ధతులతో అధిక దిగుబడి

- ప్రకృతి సాగుకు రైతులను ప్రోత్సహించాలి
- వ్యవసాయాధికారులతో కలెక్టర్ కీర్తి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ: ప్రత్యేక వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలో ఇప్పటివరకూ 99.24 శాతం ఈ-పంట నమోదు జరగ్గా, మొత్తం అన్ని పంటలు కలిపి 71.54 శాతం పూర్తయ్యిందన్నారు. అక్టోబర్ 30 వరకూ ఈ-పంట నమోదుకు గడువు ఉన్నందున, అప్పటి లోపు నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. రైతులు వరి పంటలో కృత్రిమ ఎరువుల వాడకాన్ని తగ్గించి, సహజ పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. దానిపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్ల మధ్యలో పచ్చిరొట్ట పంటలు వేసి భూమికి పోషకాలు అందేలా చేయడం వల్ల ఎరువుల వాడకం తగ్గుతుందని, అలాగే కలుపు మందుల వినియోగం కూడా తగ్గుతుందని వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించి, రాయితీపై వ్యవసాయ డ్రోన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి కల్పించాలన్నారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులు ఎంత మేర యూరియా అవసరమో, అంత మేరకే తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డీపీఎం (ఎంఎఫ్) బి.తాతారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మజోస్యుల నాయకత్వం స్ఫూర్తిదాయకం



బ్రహ్మజోస్యుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: ప్రముఖ స్వాతంత్య్ర పోరాట యోధుడు, సీతానగరం ఆశ్రమ వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం నాయకత్వం ఎందరో ఉద్యమకారులకు స్ఫూర్తి నిచ్చిందని డాక్టర్ కవికొండల శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య మైదానంలోని ఆయన విగ్రహం వద్ద గురువారం బ్రహ్మజోస్యుల జయంతిని ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కవికొండల మాట్లాడుతూ తొలి తరం పోరాట యోధుడు బ్రహ్మజోస్యుల అనేక మంది స్వాతంత్య్ర యోధులకు మార్గదర్శకుడు అయ్యారన్నారు. ఆంధ్రకేసరి యువజన సమితి సభ్యుడు మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో వైద్యుడిగా సేవలు అందిస్తున్న ఆయన.. మహాత్ముని పిలుపు మేరకు స్వాతంత్య్ర ఉద్యమంలోకి ప్రవేశించారన్నారు. ఉద్యమ స్ఫూర్తికి ఊతమివ్వడానికే ఆయన సీతానగరంలో ఆశ్రమాన్ని స్థాపించారని తెలిపారు. మహాత్ముడు రెండు పర్యాయాలు ఆశ్రమంలో బస చేసి యంగ్ ఇండియా పత్రికలో ఆశ్రమ నిర్వహణను అభినందించారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమితి పూర్వాధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు మాట్లాడుతూ సుబ్రహ్మణ్య మైదానం ప్రవేశ ద్వారం వద్ద డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం మైదానం అనే నామ ఫలకాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఆశ్రమంలో వైద్యవృత్తి నిర్వహించిన డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు తనయుడు కృష్ణ శర్మను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనుసూరి ప్రియాంక, న్యాయవాది పుట్రేవు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మైదానంలోని బ్రహ్మజోస్యుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆకుల వీర్రాజుకు సత్కారం



ఆకుల వీర్రాజును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ తాజాగా ప్రకటించిన సీఈసీ జాబితాలో సభ్యుడిగా నియమితులైన మాజీ డీసీసీబీ చైర్మన్, రాజమహేంద్రవరం రూరల్ మాజీ కో ఆర్డినేటర్ ఆకుల వీర్రాజును శుక్రవారం ధవళేశ్వరం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ధవళేశ్వరం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీర్రాజు స్వగృహానికి తరలి వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీఈసీ సభ్యుడిగా నియమించిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజల సేవకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరగ శ్రీనివాసరావు, వంటిద్దు కృష్ణ, గోలి దేవకుమార్, గునిపే అశోక్, షట్టర్ భాషా, చొల్లంగి సత్యగిరి, మోర్త పావనమూర్తి, మిరప రమేష్, నంబూరు రవి, ముత్యాల జాన్, కుమార్, మస్తాన్ బేగ్, దాసరి ధర్మ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణచంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి

- ఆయన సేవలు మరువలేనివి
- గొందేశి శ్రీనివాసులురెడ్డి



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేసిన గొందేశి శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాజకీయాలకు అతీతంగా నిస్వార్థ సేవలు అందించిన తన తండ్రి గొందేశి పూర్ణచంద్రారెడ్డి ఆశయాల సాధనకు కృషి చేస్తానని ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. పూర్ణచంద్రారెడ్డి జయంతి సందర్భంగా బాలాజీపేట సెంటర్‌లోని ఆయన విగ్రహానికి శ్రీనివాసులురెడ్డి, ఆయన అభిమానులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులకు ట్రస్టు తరఫున రూ.20 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తన తండ్రి పూర్ణచంద్రారెడ్డి బాటలోనే పేద, మధ్య తరగతి ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా నిలుస్తానన్నారు. దీనిలో భాగంగానే గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి, సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ కౌన్సిలర్, టౌన్ ప్లానింగ్ చైర్మన్‌గా గొందేశి పూర్ణచంద్రారెడ్డి నగరాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం పలు వృద్ధాశ్రమాలు, వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలో పేదలకు పండ్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు సభ్యులు రాయుడు ప్రసాద్, ఎస్.సుధాకర్, సూరంపూడి ప్రకాష్, పూడి ప్రకాష్, రెడ్డి ప్రసాద్, నగేష్, విజయానంద్ తదితరులతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, పార్టీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణు, ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు స్వదేశీ ఉద్యమం



ఖాదీ సంతలో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం సిటీ: నాడు దేశ స్వాతంత్య్రం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని.. ప్రస్తుతం దేశ ఆర్థిక స్వావలంబన కోసం మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఖాదీ సంతను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలతో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనర్ క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణ, రొంగలి గోపి పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు



మోరంపూడి సాయినగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి శ్రీను, లలితాదేవి దంపతులు అభిషేకాలు చేశారు. రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, బీజేపీ రాజమండ్రి కన్వీనర్ యెనుముల రంగబాబు, సాయినగర్ అధ్యక్షుడు రామకృష్ణ దర్శించుకున్నారు.

- బొమ్మూరు బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్, తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ పాల్గొన్నారు.
- తొర్రేడు ఓనువులమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరిగాయి. చివరిరోజు అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.

మహనీయుల సేవలు స్ఫూర్తిదాయకం



సేవా పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

కడియం: మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల సేవలు స్ఫూర్తిదాయకమని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. జై జవాన్ జై కిసాన్ సేవా సంస్థ అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో కడియం బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం గాంధీ, శాస్త్రీల జయంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సీనియర్ శాస్త్రవేత్త కొండేపూడి చంద్రావతి, మాజీ సైనికులు సలాది ఎస్.గోవిందరావు, ప్రకృతి సేద్యపు ఉత్తమ రైతు అవార్డు గ్రహీత అన్నందేవుల చంటి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావులకు సేవా పురస్కారాలు అందించి, సత్కరించారు. కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువులశాలకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గోకులం పథకం ద్వారా పశువుల శాలల నిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కవలగొయ్యి గ్రామంలో పశువులశాల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మత్సేటి ప్రసాద్, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని సంతోషి మాత ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. దసరా నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

బాధితుడికి న్యాయం చేయాలి

పెదపూడి: చింతపల్లి లాకు వద్ద ఇటీవల ఒక దళితుడి షెడ్డును కూల్చి వేసిన ఘటనలో గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఆ బాధితుడికి షెడ్డు నిర్మించాలని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు అన్నారు. ఆయన గురువారం చింతపల్లి లాక్ వద్ద విలేకరులతో మాట్లాడారు. వేంద్ర గ్రామానికి చెందిన జి.ఏడుకొండలు షెడ్డు వేసుకుని బైక్ రిపేరు పనులు చేసుకుంటున్నాడన్నారు. ఆ షెడ్డును గ్రామానికి చెందిన కొందరు కూలిచ్చేశారు. అయితే దాన్ని నిర్మించి ఇస్తామని గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారని, కానీ నిర్మాణం విషయంలో జాప్యం చేస్తున్నారన్నారు. దీనిపై బాధితుడికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ పాల్గొన్నారు.

జీఎస్‌టీ సంస్కరణలు నూతన అధ్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశ చరిత్రలో జీఎస్‌టీ సంస్కరణలు నూతన అధ్యాయమని జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.సుధాకర్ తెలిపారు. జీఎస్‌టీ సంస్కరణలపై వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్‌టీ రిటర్న్స్ ఫైలింగ్‌లో చేపట్టిన సంస్కరణలు పారదర్శకతకు దోహదం చేస్తున్నాయని, డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని అన్నారు.వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు నిజాయతీగా పన్నులు చెల్లించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

స్వచ్ఛ ఎన్జీవో అవార్డుకు స్వర్ణాంధ్ర ఎంపిక



గుబ్బల రాంబాబు, సంస్థ నిర్వాహకుడు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర సేవా సంస్థను కలెక్టర్ స్వచ్ఛ ఎన్జీవో అవార్డుకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. అక్టోబర్ 6వ తేదీన ఈ అవార్డును అందజేస్తారన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కాగా.. రాంబాబుకు స్వర్ణాంధ్ర గౌరవ సలహాదారు సినీ హీరో సుమన్, అధ్యక్షుడు రుంకాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సీపీ రెడ్డి, వ్యవస్థాపకుడు పడాల రామిరెడ్డి, పలువురు నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

జాంపేట బ్యాంకులో కొత్త డిపాజిట్ పథకం



సెంటినరీ డిపాజిట్ పథకాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ జయకుమార్

రాజమహేంద్రవరం సిటీ: జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో శీలా వీరభద్రుడు సెంటినరీ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించినట్లు ఆ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ శుక్రవారం తెలిపారు. దేవాంగ ప్రముఖుడు, ప్రముఖ వస్త్ర వ్యాపారి అయిన శీలా వీరభద్రుడు ఆధ్వర్యంలో 1926 ఆగస్టు 22వ తేదీన జాంపేట బ్యాంకును స్థాపించారన్నారు. ఇప్పటికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించామన్నారు. దీనిలో రూ.లక్ష పథకం కింద రూ 45,300 డిపాజిట్ చేస్తే, 10 ఏళ్లకు 8 శాతం వడ్డీతో రూ 1,00,024 వస్తుందన్నారు. అలాగే రూ.50 వేల పథకంలో రూ.22,650 డిపాజిట్ చేస్తే 8 శాతం వడ్డీతో పదేళ్లకు రూ.50,012 అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రొబ్బి విజయ శేఖర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: ఫీడర్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఆ సమయంలో వీఎల్‌పురం, వీఎల్ పురం పార్క్ స్ట్రీట్స్, చైతన్య కాలేజ్ స్ట్రీట్, వీఎల్ పురం పెద్ద వీధి, ఆదర్శ్ హాస్పిటల్ రోడ్, వాసిరెడ్డి రాంబాబు స్ట్రీట్, చక్రధర్ హాస్పిటల్ ఏరియా ,తిలక్ రోడ్, ఏవీ అప్పారావు స్ట్రీట్, ఆదిరెడ్డి అప్పారావు స్ట్రీట్, మార్గాని ఏస్టేట్ రోడ్, మోరంపూడి, తిలక్ రోడ్, సత్యనారాయణ పురం, రైతుబజార్ రోడ్, కోనేరుపేట, ఆల్ బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, అమ్మ హాస్పిటల్ స్ట్రీట్, మోడల్ కాలనీ, శ్రీలక్ష్మీ నగర్, గణేష్ నగర్, సాయి నగర్, బాపూజీ నగర్, గాదాలమ్మ నగర్, వెంకటగిరి, హుకుంపేట, హుకుంపేటలోని ఎస్సీ పేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

11,915 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవా పథకంలో జిల్లాలో 11,915 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి పొందనున్నారని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ శుక్రవారం తెలిపారు. ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు చొప్పున నేరుగా అతడి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి ప్రారంభిస్తారన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరుగుతుందన్నారు.

మల్టీప్లెక్స్‌పై సమగ్ర పరిశీలన

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మల్టీప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ప్రసాద్ ఆదిత్య మల్టీప్లెక్స్ భవనాన్ని సమగ్రంగా పరిశీలించాలని నగర పాలక సంస్థ అధికారులను జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఈ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే ముందు అన్ని నియమ నిబంధనలూ పూర్తిగా పరిశీలించాలన్నారు. అధికారులతో కలసి ఈ భవనాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. భవనాన్ని ప్లాన్ ప్రకారం నిర్మించారా.. నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించారా తదితర విషయాలను సమగ్రంగా పరిశీలించారు. అందరికీ భద్రత, భవన నిర్మాణ స్థిరత్వం, ఇతర అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, సీపీఓ (రుడా) జీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.